ప్రజాశక్తి

ఆదివారం 19 మే 2024 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

ఈదురుగాలులతో భారీవర్షం

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

యర్రగొండపాలెంలో వర్షంతో తడిసిన రహదారి

ప్రజాశక్తి-త్రిపురాంతకం, యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో పలు చోట్ల శనివారం ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. త్రిపురాంతకంతో పాటు మండలంలో ముడివేముల, పాపాన్నపాలెం, బడ్డ పాలెం, కంకణాలపల్లి, రాజుపాలెం, డివిఎన్ కాలనీ గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. యర్రగొండపాలెం రహదారిలో చెట్లు అడ్డంగా పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు పొంగాయి. వర్షపు నీరంతా రోడ్లపై నిలిచింది. పొలాల్లో పశువుల కుంటలు నిండాయి. కాలువలు పారాయి. భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ ప్రసారం నిలిచిపోయింది. పొలాల్లో మేతకు వెళ్లిన మేకల మందల్లోని మేకలు కనిపించకుండా పోయినట్లు పశుపోషకులు వాపోయారు.

రైతుల హర్షం

యర్రగొండపాలెం: యర్రగొండపాలెంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పదిహేను రోజులుగా ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన జిల్లా ప్రజలు వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊరట చెందుతున్నారు. రోహిణి కార్తె ▶ 2లో

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

మృతిచెందిన నారాయణ

పిడుగు పడి ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన త్రిపురాంతకం మండలంలోని డివిఎన్ కాలనీలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. డివిఎన్ కాలనీకి చెందిన అలగసాని నారాయణ(37) తన గేదెలను పొలంలో మేపుతుండగా.. పిడుగు పడింది. దీంతో నారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. నారాయణకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబాన్ని పోషించే యజమాని పిడుగు పడి మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

మహిళల ఓట్లపైనే ఆశలు.!

- తమకంటే తమకే పడ్డాయంటూ అభ్యర్థుల విశ్లేషణలు
- నారీమణుల ఓటింగ్‌పై ఇంటిలిజెన్స్ విభాగం ఆరా?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా స్వల్ప ఆధిక్యంతోనే అనే విశ్లేషణలు వస్తు న్నాయి. ఇంకా చెప్పాలంటే నువ్వానేనా అన్నట్లుగానే ఉంది. గెలిచే స్థానాల్లోనూ తక్కువ మెజార్టీలే చెబుతున్నారు. ఎవరికివారే ధీమాల్లో ఉన్నారు. ఎవరి ఓట్లు ఎవరివైపు అనే కోణంలో ఇప్పుడు ఆరా తీస్తున్నారు. ఇప్పటివరకూ గ్రామాల్లో ఇరు పార్టీలకు వర్గాలున్నాయి. వారి నివేదికల ఆధారంగా మెజార్టీలు అంచనాలు వేసుకున్నారు. స్వల్ప మెజార్టీలతో గెలుస్తామంటూ చెబుతున్నారు. మండలాలు, గ్రామాలు, బూతుల వారీగా తమకు పడ్డ ఓట్లు లెక్కించుకొని మెజార్టీలు తేల్చారు. అందరూ గెలుస్తామనే చెబుతున్నారు. పైకి ఎంత ధీమాగా ఉన్నారో లోపల అంతే ఆందోళనతో ఉన్నారు. గెలిచే దాకా పరిస్థితి ఉత్కంఠగానే ఉండక తప్పదు. అయితే పశ్చిమాన వైసిపికి, తూర్పున తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉంటుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఇప్పటివరకూ సాగిన విశ్లేషణలు.. అంచనాలు..

ఇప్పుడు కొత్త కోణాల్లోనూ ఆలోచిస్తున్నారు. మహిళల ఓటింగుపై అందరూ దృష్టి సారించారు. మహిళలు ఏ వైపు మొగ్గితే ఆ వైపు విజయం తప్పదనే భావనలో ఉన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులూ ఇప్పుడు సైలెంటుగా పడిన మహిళల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నారు. ఎవరికివారే తమకంటే తమకేనంటూ చెబుతున్నారు. పథకాల ప్రభావంతో ప్రభుత్వానికి అనుకూలంగా పడిందా? లేక ధరలు, ఇతర కారణాలతో వ్యతిరేకంగా పడిందా? అన్నదీ తేలాల్సి ఉంది. మహిళల మనోగతం ఏమిటనే దానిపైనే తర్జనభర్జన పడుతున్నారు. పార్టీల వారీగా ఉన్న ప్రాంతాల్లో చూస్తే వర్గాలకు తగ్గట్టుగానే ఎవరి ఓట్లు వాళ్లకే పడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. పట్టణాల్లో గుర్తించడం కష్టంగా మారింది. సర్వేల ఆధారంగానే మనోగతం వెలికితీసే పనిలో కొందరున్నారు. అదేవిధంగా ఇంటిలిజెన్స్ విభాగం కూడా మహిళల ఓట్లు ఎవరికి పడ్డాయి.? ఏ పార్టీకి అనుకూలంగా పడ్డాయి? ఎవరికి వ్యతిరేకంగా వేశారనే కోణంలో సమాచారం సేకరించే పనిలో పడింది. ఇందుకోసం ఆరా తీస్తున్నారు. ఎందుకంటే మహిళల ఓట్లపైనే స్పష్టత రావాల్సి ఉంది. పాలక పక్షానికి కూడా మహిళల ఓట్లపై పూర్తిస్థాయిలో స్పష్టత లేదని తెలుస్తోంది. పైకి తమకేనని చెబుతున్నారు. మరో వైపు తెలుగుదేశం కూటమి కూడా మహిళల ఓట్లు ఎక్కువగా తమకే పడి ఉంటాయనే నమ్మకంలో ఉంది. ఉదయాన్నే బారులు తీరి ఓటేశారు. పట్టణాల్లో పేదల కన్నా ముందు ▶ 2లో

కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లే వారిని

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

- కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రత
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓట్ల లెక్కింపు రోజు కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే ప్రతి ఒక్క వ్యక్తినీ క్షుణ్ణంగా గేటు వద్దనే తనిఖీ చేయాలని, కౌంటింగ్ సెంటర్ లోపలికి వెళ్లేటప్పుడు కూడా మరొకసారి తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను శనివారం కలెక్టర్, ఎస్పీ శనివారం పరిశీలించారు. జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను అన్ని నియోజకవర్గాల ఆర్‌ఓలతో, పోలీస్ అధికారులతో చర్చించారు. మొదటగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో ఏర్పాటు చేసిన పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు (సిఎపిఎఫ్), రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, మూడో అంచెలో స్థానిక సివిల్ పోలీసులు నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రోజు అభ్యర్థులను కౌంటింగ్ ఏజెంట్లను తనిఖీ చేసి పంపే విధానం, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే పద్ధతి, బ్యారికేడింగ్ ఏర్పాటు, మొబైల్ డిపాజిట్ కౌంటర్ ఏర్పాటు, మీడియా వారిని దశలవారీగా ఏ విధంగా అనుమతించాలి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏ విధంగా చూసుకోవాలి అనే విషయాల మీద నియోజకవర్గాల ఆర్.ఓలకు, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

కౌంటింగ్ రోజు కళాశాల ప్రవేశ ద్వారం వద్ద విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది కళాశాల లోపలకి వచ్చే ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాలని, వారి గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలని చెప్పారు. వాహనాలను కౌంటింగ్ సెంటర్ వైపు అనుమతించరాదని, వాటిని గేటు వద్దనే ఉన్న పార్కింగ్ ప్లేస్ లో పార్క్ చేసుకునే విధంగా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. కౌంటింగ్ సెంటర్ లో విధులు నిర్వహించే సిబ్బందికి, కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించడానికి వచ్చే అభ్యర్థులకు మరియు వారి ఏజెంట్లకు గుర్తింపు కార్డులను జారీ చేస్తారని తెలిపారు. కౌంటింగ్ రోజున కేవలం నియోజకవర్గాల ఆర్.ఓ లకు మాత్రమే మొబైల్ ఫోన్‌లకు అనుమతి ▶ 2లో

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఆదర్శ కమ్యూనిస్ట్ 'సుబ్బారావు'

'ధూళిపాళ్ల' సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొల్లూరు

మనం ఎంత డబ్బు సంపాదించినా చనిపోయిన తర్వాత దానిని మనం తీసుకొని పోలేమని, మిగిలేది కీర్తిప్రతిష్టలేనని, కామ్రేడ్ ధూళిపాళ్ల సుబ్బారావు కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి.. బతికినంత కాలం ఆదర్శ కమ్యూనిస్టుగానే జీవించాడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 28న మృతిచెందిన ధూళిపాళ్ల సుబ్బారావు సంస్మరణ సభ కొల్లూరు మండలం, అనంతవరంలో శనివారం వారి స్వగృహంలో జరిగింది. ఈ సంస్మరణ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి హాజరై సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. సభకు ముందు కామ్రేడ్ సుబ్బారావు స్మారక స్తూపం వద్ద జెండాను ఆవిష్కరించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కామ్రేడ్ సుబ్బారావు ఆశయాలను మనందరం ముందుకు తీసుకువెళ్లినప్పుడే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతం అంటే తనకున్న దానిలో లేని వారికి సహాయం చేయడమని, ఇది సుబ్బారావు జీవితాంతం పాటించారని, తెలిపారు. రైతు కుటుంబంలో పుట్టి కూలీలకి అండగా నిలబడిన వ్యక్తి కామ్రేడ్ సుబ్బారావు అని పేర్కొన్నారు. కార్యక్రమానికి సిపిఎం కొల్లూరు మండల నాయకులు బొనిగల సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, పార్టీ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, రైతుసంఘం గుంటూరు జిల్లా నాయకులు ములక శివసాంబిరెడ్డి, సిపిఎం కొల్లూరు మండల నాయకులు వేములపల్లి వెంకట రామయ్య పాల్గొన్నారు.

మహిళల ఓట్లపైనే ఆశలు.!

(మొదటిపేజీ తరువాయి)

మధ్యతరగతి వర్గాల నుంచే మహిళలు కేంద్రాలకు వచ్చి ఓటేశారు. ఈవీఎంలు కొంత జాప్యం వల్ల బారులు గంటల కొద్దీ నడిచాయి. అభ్యర్థులూ ఓటింగు సరళిపై దృష్టి సారించారు. ఓటింగు సమయంలోనే పరిస్థితిని గుర్తించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశారు. అయినా మహిళల నాడి దొరకలేదు. జిల్లాలో పోలైన ఓట్లలో మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. 8 నియోజకవర్గాల్లో 9 లక్షలా 444 మహిళల ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం కూడా పలు నియోజకవర్గాల్లో భారీగా పెరగడం కూడా కొత్త చర్చకు దారితీసింది. దర్శి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక పోలింగు నమోదైంది. 91.56శాతం పోలింగు జరిగింది. జిల్లాలో ఇక్కడే తెలుగుదేశం నుంచి మహిళా అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి పోటీలో ఉన్నారు. ఒంగోలులోనే 84.56 శాతం నమోదైంది. మిగతా నియోజకవర్గాల్లో ఇంత కన్నా ఎక్కువగానే పోలింగు జరిగింది. ఇరువర్గాలు మోహరించారు. వలస ఓటర్లను బాగానే సమీకరించారు. అభ్యర్థులు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్ వంటి పట్టణాలకు వెళ్లి కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులతో సమావేశాలు పెట్టారు. వారికి అన్ని రకాలుగా ఛార్జీలకూ ఓట్లకూ ఇచ్చి రప్పించుకున్నారు. అందుకే వేలాదిమంది తరలివచ్చారు. ఇవి పార్టీల వారీగా బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేసినందున వాళ్లపై అవగాహన ఉంది. ఎవరికి ఓటేశారనేదీ స్పష్టంగానే అంచనాలున్నాయి. ఇప్పుడు అందరి దృష్టీ భారీగా పోలైన మహిళల ఓట్లపైనే ఉంది. ఏదేమైనా లెక్కింపు వరకూ ఏదో తరహాలో పార్టీలు, అభ్యర్థుల పోలింగు సరళిపై విశ్లేషణలు కొనసాగించడం సహజమే..

క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని మిగిలిన వారందరు మొబైల్ ఫోన్ లను డిపాజిట్ చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టంగా ఏర్పాటుచేసిన మూడంచెల భద్రతలో విధులు నిర్వహించే కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మడ్ రిజర్వ్, సివిల్ పోలీస్ బలగాలు 24 గంటలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, డి.అర్.ఓ సత్తి బాబు, రేపల్లె డిఎస్పీ టి.మురళీకష్ణ, అన్ని నియోజకవర్గాల ఆర్.ఓ లు, ఇతర పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీవర్షం

(మొదటిపేజీ తరువాయి)

రాకముందే వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు దుక్కుల దున్నకం, ఎరువులు తోలుకోవడం వంటి పనులు ప్రారంభించారు.

శనివారం కురిసిన వర్షానికి భూమి మంచి పదును కావడంతో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కావచ్చని తెలిపారు. ముఖ్యంగా ఈ వర్షం ఉద్యాన పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఖాళీ పొలాల్లో వేసవి దుక్కులు దున్నడానికి పదును అవుతాయని తెలిపారు.

డాక్టర్ ఉగ్ర గెలుపు ఖాయం

ప్రజాశక్తి- వెలిగండ్ల

కనిగిరి నియోజక వర్గంలో టిడిపి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఉగ్ర నరసింహారెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాస్ రెడ్డి గెలుపు కోసం శ్రమించిన టిడిపి కార్యకర్తలకు, నాయకులకు, తెలుగు మహిళలకు, జనసేన, బిజెపి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ 57 రోజులు అలుపెరుగకుండా పనిచేసి టిడిపి విజయం కోసం శ్రమ పడిన ప్రతి కార్యకర్తకు కష్టానికి ఫలితం త్వరలో రాబోతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అవినీతి అరాచకాలు అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా అమూల్యమైన తీర్పు ఇస్తారని తెలిపారు.

చేపల చెరువులా హెల్త్ సబ్ సెంటర్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం కొత్తపల్లి తిమ్మాపురం హెల్త్ సబ్ సెంటర్ శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికి చేపల చెరువును తలపిస్తోంది. సెంటర్ పళ్లెంలా తగ్గు ప్రదేశంలో ఉండటం వల్ల గ్రామం రోడ్లో పడ్డ వర్షపు నీరు అంతా సబ్ సెంటర్లోకి చేరింది. చేరిన నీరంతా నిలిచి ఎటు పోలేక నిలుస్తోంది. ఆ నీటిలో సబ్ సెంటర్‌లోని కుర్చీలు, ఇతర వస్తువులు నీళ్లలో తేలియాడుతున్నాయి.

హెల్త్ సబ్ సెంటర్‌లో చేరిన నీరు

దానిమ్మతోటలో కాలిపోయిన చెట్లు

దానిమ్మతోట దగ్ధం

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని తంగిరాలపల్లిలో దానిమ్మ తోట దగ్ధమైంది. వివరాల ప్రకారం.. పెద్దారవీడు మండల టిడిపి పార్టీ మాజీ అధ్యక్షుడు తడికమళ్ల బాలసుబ్బారావుకు చెందిన ఈ దానిమ్మ తోటకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది శనివారం సంఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన దానిమ్మ తోటను పరిశీలించారు. దానిమ్మ తోట యజమాని తడికమళ్ల బాలసుబ్బారావును అడిగి వివరాలు సేకరించారు.

గనివెనపాడులో అన్నదానం



అన్నదానం కార్యక్రమం దృశ్యం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గనివెనపాడు గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం గ్రామంలో ఎంతో ఉత్సాహంగా ఐకమత్యంతో కార్యక్రమాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా సర్పంచ్ పావులూరి లక్ష్మి వెంకటేశ్వర్లు మామ పోకూరి రమణయ్య గ్రామంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు రమణయ్యను అభినందించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

BEFOE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION - II :: AT VISAKHAPATNAM

C.C.No. 166 OF 2023

BETWEEN :
M/s Sevenhills Healthcare Pvt Ltd
…Complainant
And
M/s Geotech Healthcare India, rep by its Proprietor and another
…Opp., Parties -1 & 2

To
Opposite Party No - 1 :
M/s Geotech Healthcare India, rep by its Proprietor, Situated at D.No.7-14/6, 2nd Floor, Srinivasa Colony, Kurnool Road, Ongole.

Please take notice the above CC filed by the complainant under the Consumer Protection Act and the Hon'ble Court was pleased to order notice to Opposite Party No -1 through this publication. You are hereby required to appear before the Hon' ble Commission either in person or through duly instructed Advocate on 06-06-2024 at 10:30 A.M in the above Commission, failing which the matter will be heard and adjudicated in your absence, as per Law.

(By Order of the Hon'ble Court)
V.HEMANTH KUMAR, Advocate
Visakhapatnam. Cell: 7569658232.

ఏపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో 592 ర్యాంకు

సత్తా చాటిన విద్యార్థి ప్రసాద్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వెలువడిన ఏపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో చప్పిడి ప్రసాద్ అనే విద్యార్థి 592 ర్యాంకుతో సత్తా చాటి ఫ్రీ సీటు సాధించినట్లు యర్రగొండపాలెం పట్టణంలోని వాసవీ అకాడమీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పి బాలవీరయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చప్పిడి ప్రసాద్ మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన దళిత విద్యార్థి అని తెలిపారు. తండ్రి చనిపోగా తల్లి అచ్చమ్మ టైలర్‌గా పని చేస్తూ తన కుమారుడిని చదివించుకుంటోందని తెలిపారు. ఈ క్రమంలోనే పదో తరగతి అనంతరం తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు భవిష్యత్తులో ఎక్కువమంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మంచి ర్యాంకు సాధించిన చప్పిడి ప్రసాద్‌కు ఈ నెల 22న గుంటూరు పరీక్షా భవన్‌లో జరిగే మొదటి దశ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాలని ఏపిఆర్‌జెసి నుంచి ఆహ్వానం అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకు సాధించిన విద్యార్థి చప్పిడి ప్రసాద్‌కు ఆయన అభినందలు తెలిపారు.

విచ్చలవిడిగా మట్టి తరలింపు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం యడవల్లి పెద్ద చెరువులో చెర్లోపల్లి సమీపాన విచ్చలవిడిగా చెరువులో మట్టిని చుట్టుపక్కల ఇటుకుల బట్టీలకు, ప్లాట్లకు తరలిస్తున్నారు. ఎన్నికలు ముగిసిన తదుపరి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో అంతా మాదే రాజ్యం అన్నట్లు మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అనంతపూర్ టూ అమరావతి జాతీయ రహదారిపైనే ట్రాక్టర్ల మేర చెరువు మట్టి చేరవేస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనంతపూర్ టూ అమరావతి జాతీయ రహదారిపై తరలిపోతున్న మట్టి

ఉప్పుగుండూరులో అన్నదానం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆరాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా శ్రీగోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం వేదపండితుల సమక్షంలో గోనుగుంట బ్రహ్మాచారి పర్యవేక్షణలో శనివారం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పూర్ణచంద్రరావు, ప్రకాశరావు, నాగకుమార శర్మ,మురళీ ,హనుమంతరావు, మధసూదనరావు, నాగేశ్వరావు, దుర్గాప్రసాదు, విజయ్ ,జి.నాగేశ్వరశర్మ, గిరినాథ్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 939/2019

Union Bank of India.
SBMC Branch, Ongole ......వాది
వర్సెస్
Valleti Prasanna Kumar ... ప్రతివాది

To
Defendant,
వల్లేటి ప్రపన్న కుమార్, S/o. భాస్కరరావు,
H.No. 1-164/1, Bricks Street,
లక్ష్మీ తిరుపతమ్మ గుడివద్ద, గోపాలనగరం,
ఒంగోలు.,అనువారికి

మీ పైవాది దావా పరిహారములు రాబట్టుకొను నిమిత్తం మీపై దావా చేయగా దావా నోటీసు నిమిత్తం తే. 18-06-2024 ది ఉదయం. 10.30 నిమిషాలకు వాయిదా ఉన్నందున మీరు స్వయంగా కాని లేక వకీలు ద్వారా కాని పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనని ఎడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //

ఒంగోలు
18-05-2024 ఇట్లు
ముదివర్తి రాఘవరావు,
పెళ్ళూరి వసుంధర,
అడ్వకేట్స్
సీతారాంపురం, ఒంగోలు

జనరల్ నోటీసు

ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

GWOP : 7/2024

మేదరమెట్ల కావ్యరెడ్డి .... పిటిషనరు
వర్సెస్
నిల్ ...... రెస్పాండెంట్

పై తెలిపిన కోర్టు వారి ఎదుట పై తెలిపిన పిటిషనరు పైనెంబర్ కేసు నందు తన మైనరు కుమరుడు అయన మేదరమెట్ల జ్ఞానసాయిప్రదీప్ రెడ్డి @ సాయిరెడ్డి మేదరమెట్ల పేరునగల ఈ క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్తిని అమ్ముటకు గాను కోర్టు వారి పర్మిషన్ కోరుచూ దాఖలు చేసుకుని ఉన్నారు ఇందు విషయమై ఆక్షేపణలు ఉన్నవారు పై తెలిపిన కోర్టు వారి ఎదుట తేదీ09-07-2024న ఉదయం 10.30 గంటలకు హాజరుపడి మనవి చేసుకొనవలసినది. అని యవన్మంది ప్రజానీకానికి తెలియ జేయడమైనది

షెడ్యూలు

ప్రకాశంజిల్లా మార్కాపురం రిజిస్ట్రేషన్ కందుకూరు సబ్‌రిజిస్ట్రీ ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామ సర్వేనెంబర్ 385/1లోని య 2.00 సెంట్ల లోని య 2.00 సెంట్ల కు హద్దులు
తూర్పు : మేదరమెట్ల కావ్య రెడ్డి భూమి
దక్షిణం : చింతం వెంకటరామిరెడ్డి భూమి
పడమర : వరవ
ఉత్తరం : కాకు మాలకొండయ్య వగైరాల భూమి

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది 18-05-2024 ఇట్లు
పోకల వెంకటేశ్వర్లు
పిటిషనరు తరపు అడ్వకేట్
ఒంగోలు

ఉపాధి కూలీలకు రోజు వారీ వేతనం రూ.600 ఇవ్వాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు రోజు వేతనం రూ.600 ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన హనుమంతునిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు కూలి పెంపు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో రోజు వారీ కూలి రూ. 273 నుంచి రూ.300 వందలకు పెంచినట్లు తెలిపారు. అయితే వ్యవసాయ కార్మిక సంఘం రోజు కూలీ రూ. 600 పెంచాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు ఆయిల్ ధరలు, రవాణా ఛార్జీలు, గ్యాస్ ధరలు సామాన్యుడికి సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నట్లు తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఉపాధి కూలీలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.300 కూలీ ఏమాత్రం సరిపోదని తెలిపారు. జీఎస్టీ పేరుతో ప్రతి వస్తువుపై అదనపు పన్నులు వేస్తూ ప్రభుత్వ ఖజానాన్ని నింపుకున్నట్లు తెలిపారు. పేదలపై భారాలు మోపుతూ ఆదాని, అంబానీలకు ప్రభుత్వ సంపదను దోచి పెడుతున్నట్లు తెలిపారు. 140 కోట్ల మంది ప్రజలకు ఉపయోగకరమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రతి ఏడాది నిధుల్లో కోత పెడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పట్ల వివక్షత చూపుతుందన్నారు. ఉపాధి హామీ చట్టానికి కనీసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కూలీలతో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

మృతిచెందిన గొర్రె పిల్లలు

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి

ప్రజాశక్తి-అర్ధవీడు

వీధి కుక్కల దాడిలో 25 గొర్రె, మేక పిల్లలు మృత్యు వాత పడ్డాయి. ఈ ఘటన అర్ధవీడు మండలం పాపినేనిపల్లె పంచాయతీ పరిధిలోని అంకభూపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల పూరి నాగేశ్వరరావుకు చెందిన గొర్రె పిల్లల దొడ్డిపై పడి వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో 25 గొర్రె పిల్లలు, 5 మేక పిల్లలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్యుడు డాక్టర్ బి. శ్రీధర్ ఘటనా స్థలాన్ని గాయపడిన గొర్రె,మేక పిల్లలకు వైద్య చికిత్స చేశాయి. అయినప్పటికీ 25 గొర్రె, మేక పిల్లలు చనిపోయాయి. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి రమాదేవి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- కనిగిరి

విద్యుత్‌షాక్‌తో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన కనిగిరి మండలం మండాదివారిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండాది రామకోటయ్య (70) తన ఇంటి సమీపంలోని త్రీఫేస్ విద్యుత్ మోటారుకు సంబంధించిన వైరు తెగిపోవడంతో దాన్ని సరి చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి - పొదిలి

బైకు అదుపు తప్పి బస్సును ఢీకొన్న ఘటనలో పారిశుధ్య కార్మికుడి గాయాలయ్యాయి. అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఓబులక్కపల్లి గ్రామానికి చెందిన కోనంకి రామయ్య పొదిలి పట్టణంలో పారిశుధ్య కార్మికుడిగా పనులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా విధులు నిర్వహించేందుకు బైకుపై పొదిలి వస్తున్నాడు. మార్కాపురం అడ్డరోడ్ వద్దకు వచ్చేసరికి గిద్దలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఎదురుగా వస్తుంది. బస్సు లైట్ల కాంతి కంటిలో పడింది. దీంతో బైకును ఢీకొంది. దీంతో రామయ్యకు గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్లు క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పొదిలి మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి వైద్యశాలకు వెళ్లి రామయ్యను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రామయ్య ఒంగోలు తరలించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఒంగోలులో చికిత్స కోసం ఆర్థిక సహాయం అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల చెరువులో విషప్రయోగం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని వైచెర్లోపల్లి గ్రామానికి చెందిన పరిశపోగు ఇజ్రాయేలు 70 సెంట్ల పొలంలో చేపల చెరువును ఏర్పాటు చేసుకున్నాడు. అందులో చేపలు పెంచుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 15న చేపల చెరువులో విష ప్రయోగం చేశారు. దీంతో చేపలు చచ్చి నీటిలో తేలాడాయి. రూ.నాలుగు లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అంకమారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

ఉచిత కరాటే శిక్షణ

కొండపి : మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో మన ఊరి విద్యా వికాసం సంస్థ ఆధ్వర్యంలో కరాటే, తైక్వాండో ఉచిత వేసవి శిక్షణను శనివారం ప్రారంభించినట్లు నిర్వాహకుడు ధర్మవరపు అజయ్ తెలిపారు. ప్రతి ఏడాది తమ సోదరుడు ఎన్ఆర్ఐ ధర్మవరపు ప్రసాదు సహకారంతో కీర్తిశేషులు ధర్మవరపు వెంకటరంగయ్య, వరమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు కరాటే, తైక్వాండో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గత 11 సంవత్సరాలుగా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ తైక్వాండో శిక్షకుడు మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మార్షల్ విద్య వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం మరియు ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దర్శి : తాళ్లూరు మండలం దోసకాయలపాడు ఎస్‌సి కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త యాచవరపు విశ్రాంతమ్మ శనివారం మతిచెందింది. వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తరపున గ్రామ సర్పంచి కోట శివలక్ష్మి, వెంకటరామిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కొండపి : ఆటల వల్ల మానసిక వికాసం పెంపొందుతుందని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. . అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి-పొదిలి

ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పోతవరం గ్రామం వద్ద శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... నంద్యాల పట్టణంలోని నూనెపల్లె, ఏకలవ్య నగర్‌కు చెందిన అవుకు తరుణ్‌కుమార్, పుష్పావతి దంపతులు మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులు, తమ బంధువు సిసింద్రి కలిసి ఆటోలో విజయవాడ కనకదుర్గమ్మ గుడికి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకొని సిసింద్రి అత్తగారి ఊరైన ఒంగోలు సమీపంలోని బూరేపల్లి గ్రామానికి వచ్చారు. అక్కడ రాత్రికి బస చేసి శనివారం ఉదయం కొత్తపట్నం బీచ్‌కి వెళ్లారు. అనంతరం నంద్యాలకు బయలు దేరారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆటోను లారీ ఢీకొంది. ఆటో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. దీంతో మధు రోహిత్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మతి చెందాడు. తరుణ్ కుమార్, పుష్పావతి, తల్లి రమాదేవికి గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఎస్ఐ జి కోటయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన బైకు..

వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బైకు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మార్టూరు మండలం జంగ మహేశ్వరపురం పంచాయతీ పరిధిలోనివలపర్ల – కొమ్మినేనివారిపాలెం మధ్య కొమ్మూరు మేజర్ కాలువ వద్ద శనివారం చోటు చేసుకుంది. మతుడి బంధువుల కథనం ప్రకారం.. బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య (60) బైకుపై అద్దంకి నుంచి తమ స్వగ్రామానికి ధర్మవరం మీదుగా వస్తున్నాడు. బైకు ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి కొమ్మూరు మేజర్ కాలువలోకి దూసుకెళ్లింది. అటుగా వెళుతున్న వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి స్పందించారు. లక్ష్మయ్య కాలువలోంచి బయటకు తీసి గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. లక్ష్మయ్యను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మృతిచెందిన లక్ష్మయ్య

బైకును ఢీకొన్న గుర్తుతెలియని వాహనం..

యువకుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

బైకును గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈఘటన మార్టూరు సమీపంలోని రాజుపాలెం పోలీస్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అర్బన్ సిఐ రాజశేఖరరెడ్డి కథనం ప్రకారం... జె.పంగులూరు మండలం బైటమంజులూరు ఎస్‌సి కాలనీకి చెందిన తాళ్లూరి వెంకయ్య(25)ఓ ప్రైవేట్ కంపెనీ లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెంకయ్య భార్య మగ బిడ్డకు జన్మనిచ్చింది. భార్యా, బిడ్డను చూసేందుకు వెంకయ్య మార్టూరు మీదుగా అత్తగారి గ్రామమైన రాజుపాలెంకు బైకుపై వెళ్తున్నాడు. హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి వచ్చే క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొంది. దీంతో వెంకయ్య తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న వెంకయ్యను గమనించి మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు 108 వాహనంలో తరలిస్తుండగా, వెంకయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వెంకయ్యను పరిశీలించి గుంటూరు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మార్గమధ్య లోనే వెంకయ్య మతి చెందాడు. దీంతో అంబులెన్స్ సిబ్బంది వెంకయ్య మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. ప్రమాదం గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న వెంకయ్య బంధువులు హుటాహుటిన మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు బైకును ఢీకొట్టిన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సిఐ తెలిపారు.

మృతిచెందిన వెంకయ్య

మండుతున్న కాయగూరల ధరలు

ఇంకొల్లు ఎన్టీఆర్ సెంటర్లో కాయగూరల అంగడి

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇప్పటి వరకు రాజకీయ వేడి. మరోవైపు వేసవి వడగాల్పులు వీస్తూ ఉన్నాయి. ఎన్నికల అనంతరం రాజకీయ వేడి తగ్గుముఖం పట్టింది. అలాగే గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తూ చల్లబడి వేడి గాలులు తగయి. కాని మరోవైపు ప్రజాజీవనంలో నిత్యవసర వస్తువుల ధరలతో పాటు కూరగాయల ధరలు మండుతున్నాయి. వేసవి కాలంలో సహజంగానే కొన్ని కూరగాయల ఉత్పత్తి పడిపోతుంది. దీనితో వాటి ధరలు పెరుగుతాయి. అయితే ఈ ఏడాది గత ఆరు నెలలుగా ఇప్పటివరకు వర్షాలు లేకపోవడం, వాతావరణం ఎక్కువగా వేడిగా ఉండటం కాయగూరల సాగు అనువైన నీటి వసతి లేకపోవడంతో ఉత్పత్తి ప్రస్తుతం తగ్గింది. కొన్ని రకాల కూరగాయలు చుక్కలంటుతున్నాయి. వీటికి తోడు సహజంగా అన్ని రకాల కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయి. ఆకుకూరల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. పెరిగిన ధరలు ప్రజల మనుగడపై భారం చూపుతున్నాయి. దోస కాయలు కేజీ రూ.60 నుంచి రూ.70, మార్కెట్లో అయితే ఒక్కో టిక్కీ ధర రూ.400 నుంచి రూ.500లు హెూల్ సేల్ ధర ఉంది. బీరకాయలు 10 కేజీలు రూ.400 హెూల్సేల్ ధర. అలానే కేజీ మార్కెట్లో రూ.60. కాకరకాయలు 10కేజీలు హెూల్సేల్ ధర రూ.600. కొనుగోలు దారులకు మార్కెట్లో కేజీ రూ.80 నుంచి రూ.90 పలుకుతున్నాయి. టమోటా కేజీ రూ.40, వంకాయలు, బెండకాయలు, దొండకాయలు కేజీ రూ.15 నుంచి రూ.20, రూ.25 అమ్మగా ప్రస్తుతం వాటి ధర కూడా కేజీ రూ.40కి వినియోగదారులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. పచ్చి మిరప పావు కేజీ రూ.40. సామాన్యులకు కూలి నాలీ చేసుకునే వారికి మధ్య తరగతి వారికి, దిగువ తరగతి ఉద్యోగులకు ఈ కూరగాయల ధర రోజు వారి భారంగా మారింది. సామాన్యంగా ముగ్గురు, నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంట్లో మూడు పూటలా కూరగాయలకు కేజీ అవసరమవుతాయి. కేజీ రూ.60 సగటున వేసుకున్న వీటికి తోడు వీటిలో వేసే దినుసులు, నూనె ఖర్చు అదనంగా అవుతుంది. అని కలిపి కుటుంబానికి రోజుకు రూ.60 నుండి రూ.100 వరకు కూరగాయల ఖర్చు పెరిగిన ధరలతో అవుతుంది. ఈ లెక్కన నెలకు రూ.3వేలు నలుగురు సభ్యులున్న కుటుంబానికి అవుతుంది. వినియోగదారులు, రాజకీయ నాయకులు ఇటీవల ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఓటుకు రూ.1500 చొప్పున సభ్యులకి చెల్లించిన్న డబ్బులు ఇచ్చారు. అవి ఒక నెలకు కూరగాయలకే సరిపోతాయని వాపోతున్నారు.

ధరలతో చాలీ చాలని కూరలే

వై మంగమ్మ, ఇంకొల్లు

రోజువారి కూలి పనులు చేసుకుని జీవనం సాగించే కుటుంబం. ఇంట్లో భార్య, భర్తలతో పాటు మరో ఇద్దరు అమ్మాయిలు తమ కుటుంబ సభ్యులు. పెరిగిన కూరగాయల ధరలతో సరిపడ కూరలు చేసుకొని తినాలంటే ఇబ్బందిగానే ఉంది. చాలీ చాలని కూర చేసుకున్న రోజుకు దాదాపు రూ.80 నుంచి రూ.100 వరకు కొనుగోలు చేసిన కూరగాయలకు ఖర్చు అవుతుంది.

సత్రం స్థలం అన్యాక్రాంతమైతే అడ్డుకుంటాం

సమావేశంలో వైసిపి నాయకులు ఇనగలూరి మల్యాద్రి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం స్థలం అన్యా క్రాంతం అవుతుందని వైసిపీ పట్టణ నాయకులు ఇనగలూరి మల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కోన ఛాంబర్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలు కుల, మతాలకు అతీతంగా పిండ ప్రదానాలు, కర్మ, కాండలు ఆ సంత్రంలోనే జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ మధ్య కాలంలో జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి సిమెంటు, కంకరు మిక్సింగ్ యూనిట్కు రోడ్డు కాంట్రాక్టర్కు కొంత స్థలాన్ని లీజుకు ఇచ్చారని తెలిపారు. పిండ ప్రదానాలు, కర్మ కాండలు చేసుకోవడానికి నూతన భవన నిర్మాణానికి ఎంఎల్ఎ కోన రఘుపతి శంకుస్థాపన ఇటీవలే చేశారు. సత్రం అభివృద్ధి కమిటీని కూడా ఆ రోజు నియమించినట్లు తెలిపారు. కమిటీ కార్యకలాపాలు నిలిచిపోయాయని అన్నారు. ఈ స్థలాన్ని దేవాదాయ శాఖ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంక్ నిర్వహణకు లీజుకు ఇచ్చినట్లు తెలుస్తోందని అన్నారు. దీనికి సంబంధించి సంబంధిత అధికారులు స్థలంలో శనివారం కొలతలు తీశారని పేర్కొన్నారు. దీనిపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవ్వరికి తెలియ కుండా ఐఓసీ కంపెనీకి స్థలాన్ని లీజుకి ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్న దశలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి లీజుకి ఇవ్వడం పట్ల తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న సమయంలో కనీసం స్థానిక ఎంఎల్ఎ కోన రఘుపతికి సమాచారం లేకుండా లీజుకు ఇచ్చినట్లు దేవాదాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక పంపడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి లీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లీజు రద్దు కాని పక్షంలో పేరం గరుడాచలం ఆస్తులను కాపాడేందుకు ఉద్యమిస్తామని అన్నారు. సమావేశంలో ఎఎంసి వైస్ చైర్మన్ ప్రసాద్, వెంకటప్పయ్య, పీటాబాబు, నర్రా వెంకట్రావు పాల్గొన్నారు.

పేరం గరుడాచలం నాయుడు సత్రం ప్రధాన ద్వారం

బుర్ర కాలువ అభివృద్ధికి నోచుకోదా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సాగునీటి కాలువలు పూడిపోయి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక రైతులు నానా అవసస్థ పడుతున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పాలనలో డెల్టా ఆధునీకరణ పనుల పేరుతో అన్ని రకాల కాలువలు అభివృద్ధి చేసి అవసరమైన చోట వంతెనలు కూడా నిర్మించారు. ఆ సమయంలోనే భట్టిప్రోలు, ఐలవరం గ్రామాల మధ్య ఉన్న బుర్ర కాలువ అద్దేపల్లి డొంక నుండి అల్లూరు కాలువ వరకు పూడి ఉన్న కాలువ అభివృద్ధి జరుగుతుందని రైతులు భావించారు. కానీ కాలువ పూడికతీత చేపట్టి కాలువని ఏర్పాటు చేసేందుకు కాలువకు ఇరువైపుల ఉన్న రైతులు కట్టలను ఆక్రమించుకుని సాగు చేస్తూ ఉండటంతో అభివృద్ధిని అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ కాలువ సుమారు 200మీటర్లపైగా పూడిపోయి ఉండటంతో ఇరువైపులా రైతులకు ఆక్రమణకు అనుకూలంగా మారింది. కాల్వ చివరికి వెళ్లి అల్లూరు మురుగు కాలువలో కలుస్తుంది. కానీ సుమారు వంద మీటర్ల నుండి మురుగు కాలువ సమీపంలో కట్టలు కూడా రైతులు ఆక్రమించుకోవడంతో కాలినడక గట్టు కూడా లేని పరిస్థితిగా తయారయింది. దీని కారణంగా రైతులు ఆ కాలువపై పంట పొలాలకు వెళ్లేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

కాలువ పూడికతో నీరంతా మురుగుపాలు

కాలువ మైలవరం, అద్దేపల్లి గ్రామాలను కలిపే డొంక వద్ద నుండి పూడిపోవడంతో సాగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. కుడి వైపుకు తిరిగి సమీపంలోని మురుగు కాలువలోకి వెళుతుంది. దీని కారణంగా కాల్వ పక్కనే ఉన్న అనేక మంది రైతులకు సాగునీరు అందక ఒక్కో సమయంలో ఆయిల్ ఇంజన్ల ద్వారా పంట పొలాలకు నీటిని వినియోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడిపోయిన బుర్ర కాలువను ప్రొక్లైన్ ద్వారా పూడికతీత చేపట్టి కాలువగా ఏర్పాటు చేస్తే అటు రైతులకు సాగునీటితో పాటు కాలువ కట్టలు కూడా బలపడి రైతుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పూడిపోయిన కాలువను పూడికతీత చేపట్టి రైతులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత రైతులు కోరుచున్నారు.

పూడిపోయిన బుర్ర కాలువ

కలెక్టర్ను సన్మానిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

కలెక్టర్ రంజిత్ బాషాకు సత్కారం

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్ధ వంతంగా నిర్వహించిన కలెక్టర్ పి రంజిత్ భాషాను రెడ్ క్రాస్ సభ్యులు అభినందించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బిఎస్ నారాయణ భట్టు ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులు కలెక్టర్ను ఘనంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణ భట్టు మాట్లాడుతూ ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో వాంఛనీయ సంఘటనలకు తాగు లేకుండా నిర్వహించిన కలెక్టర్ రంజిత్ భాషా అభినంద నీయులని అన్నారు. జిల్లాలో పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రశాంతంగా ఎన్నికలు జరిపారని అన్నారు. ఓటర్లను చైతన్యం చేశారని అన్నారు. ఫలితంగా రాష్ట్రంలో అత్యధిక ఓట్లు పోలైన జిల్లాలో ఒకటిగా బాపట్ల జిల్లాను నిలిపారని అన్నారు. ఎస్పి వకుల్ జిందాల్ శాంతిబద్రతలు పర్యవేక్షించారని అన్నారు.

సైకిల్ బహుకరిస్తున్న భాస్కర ఫౌండేషన్ చైర్మన్ అనిల్

పేద విద్యార్థికి సైకిల్ బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

సమాజ సేవ లక్ష్యంగా పద్మ భాస్కర్ ఫౌండేషన్ పనిచేస్తుందని, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు తమ వంతు సహకారం అందిస్తుందని ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ అన్నారు. పట్టణంలోని పేరాలకు చెందిన 7వ తరగతి చదువుతున్న లియోర చదువులో రాణిస్తుందని, పేదరికంకు తోడు ఆమె తండ్రి ఇటీవల మరణించడంతో తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. చదువులో రాణిస్తున్న లియోరాను ప్రోత్సహిస్తూ పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ అవసరమని భావించి తమ ఫౌండేషన్ ద్వారా అందజేసినట్లు తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి తమ వంతు ఆర్థిక సహాయం అన్నివేళలా అందిస్తుంటామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అడ్వకేట్ వాసు బాబు, వనమా జయ కుమార్, ఎడ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

శిక్షణ నిర్వహిస్తున్న గ్రంథ పాలకురాలు ధనమ్మ

గ్రంథాలయంలో శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చీరాల

వేసవి కాలంలో విద్యార్థులకు మేధాస్సు, నైపుణ్యాన్ని పెంచేందుకు చిన్న పిల్లలకు నీతి కథలు, ఆట, పాటలతో ప్రోత్సహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు ధనమ్మ తెలిపారు. గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చిన్నారులకు జాతీయ నాయకుల జీవిత చరిత్రల పుస్తకాల పఠనం చేయించినట్లు తెలిపారు. పిల్లల మానసిక ఆనందం కోసం క్యారమ్స్, చెస్ ఆటలు ఆడించినట్లు తెలిపారు. జూన్ 7వరకు శిక్షణ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రతిఏటా లాగా ఎక్కువ మంది హాజరై వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. గ్రంథాలయంలో కొత్తగా వచ్చిన పుస్తక సంపదను ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ కె మోహన్ ఇంగ్లీషు గ్రామర్ వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లీషుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ రాజు

స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 3వరోజు శనివారం నిర్వహించారు. శిక్షణకు 26 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కాగా ప్రిన్సిపల్ రాజు స్పోకెన్ ఇంగ్లీష్, ఈజీ మెథడ్స్ ఇన్ మ్యాథమెటిక్స్ బోధించారు. సరళమైన ఉచ్చరణతో ఇంగ్లీషులో మాట్లాడే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు పాల్గొన్నారు.

కర్రల సపోర్టుతోనే..

- శిథిలావస్థలో భవనాలు
- పెచ్చులూడి పడుతున్న స్లాబ్
- పొంచిఉన్న ప్రమాదం
- భయాందోళనలో ఉద్యోగులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం పరిస్థితి దారుణంగా ఉంది. వర్షం పడితే చాలు భవనం నిలువెత్తున్న ఉరుస్తోంది. నీరు పడేచోట ఉద్యోగులు డబ్బాలు పెట్టుకొని విధులు నిర్వహించాల్సి వస్తుంది. భవనం శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో కిందిస్థాయి ఉద్యోగులు స్లాబ్ పెచ్చులూడే చోట పోటీ కర్రలు పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ తమ విధులు నిర్వహించాల్సి వస్తోంది. సబ్‌స్టేషన్‌లో ఓ రూము పూర్తిగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అదే విధంగా పచాయతీ రాజ్ శాఖ కార్యాలయ భవన పరిస్థితి గురించి చెప్పుకునేందుకే అధికారులు సిగ్గుపడాల్సిన పరిస్థితి ఉంది. ఈ భవనం ఏ క్షణంలో కూలిపోతుందేమోనని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చిన చూసి నిధులు ఇస్తామని చెప్పి పోవడం తప్ప నిధులు మంజూరు చేసిన పరిస్థితి లేదు. ఇదే కార్యాలయంపై ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం పరిస్థితి కూడా దారుణంగానే ఉంది. ఏ క్షణాన కార్యాలయ భవనం భయంతో ఉద్యోగులు క్షణక్షణాన భయపడుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలను నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు. నిత్యం ప్రజలు వచ్చిపోయే ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ కార్యాలయాల భవనాలు కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేకు శిథిలా భవనాల్లో ఉద్యోగులు తమ ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు.

విద్యుత్ సబ్ కార్యాలయంలో స్లాబ్ పెచ్చులు ఊడ కుండా పెట్టిన కర్రలు

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద పెట్టిన కర్రలు

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించొచ్చు

సివిల్ ర్యాంకర్ రాహుల్ కుమార్

ప్రజాశక్తి -కనిగిరి

ఆత్మ విశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని, రోజుకు 18 గంటల పాటు నిర్విరామంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని సివిల్ ర్యాంకర్ వి.రాహుల్ కుమార్ తెలిపారు. కనిగిరి పట్టణంలో ఐడిఎల్ కంప్యూటర్స్ డైరెక్టర్ బిజెవి.ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన మీట్ ద స్టూడెంట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఏదో ఒక మేలు చేయాలనే తపన ఉండాలన్నారు. ఆ తపనతోనే తాను కూడా ఐఎఎస్ అయినట్లు తెలిపారు. ఐఎఎస్ కావాలన్నది తన గోల్ అని తెలిపారు. తమ తాతయ్య గొప్పవాడివి అవుతావని చెప్పేవారని తెలిపారు. తనను ప్రోత్సహించిన తన తల్లిదండ్రులు, విద్యాభ్యాసంలో తనను ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను ఎన్నటికీ మర్చిపోలేని ఈ సందర్భంగా రాహుల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి షేక్ గయాజ్ బాషా, ఎస్‌విఎల్ ,కెటిసి పాపారాయుడు ,ఫణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాహుల్ కుమార్ ను సత్కరిస్తున్న పవీణ్ కుమార్

దాహార్తి తీరుస్తున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని శివరాజ్ నగర్ సమీపంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్ పక్కన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును 1977లో నిర్మించారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా దర్శి, పొదిలి మండలాల ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ ఏడాది కష్ణా నది పరివాహక ప్రాంతంలో వర్షాలు పడనందున నాగార్జునసాగర్‌కు నీరు రాలేదు. తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్ నెలాఖరులో ఐదు టిఎంసిల నీటిని సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఎన్‌ఎపి స్కీంకు అధికారులు 200 హెచ్‌పి 2 సామర్థ్యం కలిగిన రెండు పంపులు, రెండు 100 హెచ్‌పి పంపులు, మూడు 75 హెచ్‌పి పంపుల ద్వారా నీటిని ట్యాంకు 70 శాతం వరకూ నింపారు. ఈ నీటిని వేసవిలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు వారానికి రెండు రోజులు చొప్పున గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. దర్శి మండలంలో 55 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు ఎఇ చైతన్య తెలిపారు. ముండ్లమూరు స్కీం ద్వారా 42 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముండ్లమూరు మండలంలో మారెళ్ళ ఆమ్లెట్ పరిధిలో ఎనిమిది గ్రామాలకు నీటిని సరఫరా చేయలేదన్నారు. ఆ గ్రామాలలో డ్రీ బోర్లు ద్వారా నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. దర్శి స్కీమ్ ద్వారా వేసవిలో తాగునీటి అవసరాల కోసం వదిలి నీటిని ప్రజలు పొదుపుగా వినియోగించుకోవాలని ఎఇ చైతన్య తెలిపారు. ఏడు ఫిల్టర్ బెడ్‌ల ద్వారా నీటిని శుద్ధిచేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముండ్లమూరు స్కీంకు ప్రత్యేకంగా రాపిడ్ ఫిల్టర్ల ద్వారా శుద్ధిచేసి నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దర్శి మండలంలో పెదవులవాడ, చిన్న ఉయ్యాలవాడ, కష్ణాపురం, కొర్లమడుగు గ్రామాలకు రామతీర్థం స్కీం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా దర్శి ఎన్‌ఎపి స్కీం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు ఎఇ చైతన్య తెలిపారు.

దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

నీటిని శుద్ది చేస్తున్న ఫిల్టర్ బెడ్‌లు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త కడియాల లలిత సాగర్ హైదరాబాదులోని ఆయన నివాస గృహంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి-దర్శి

టిడిపి నాయకులతో ఎమ్మెల్యే స్వామి

ఎమ్మెల్యే స్వామి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ శ్రీవరహాలక్ష్మినరసింహ స్వామి దేవస్థానాన్ని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల సింగయ్య, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, నక్క బ్రహ్మేశ్వరరావు, చిగురుపాటి శేషగిరి, కాకా శ్రీనివాసరావు, షేక్ మున్నా, సన్నెబోయిన మాలకొండయ్య, షేక్ గౌస్, చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన వధువును ఆశీర్వదిస్తున్న డాక్టర్ దద్దాల

వివాహ వేడుకల్లో 'దద్దాల'

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని నల్లమడుగుల గ్రామంలో పిడతల వారి వివాహ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి కనిగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధువు మేరీషెల్లాను ఆశీర్వదించారు. తొలుత ప్రోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడిన షేక్ నజీర్‌ను పరామర్శించారు, ఆయా కార్యక్రమాల్లో జడ్‌పిటిసిల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, నాయకులు బైరెడ్డి తిరుపతిరెడ్డి, షేక్ బుజ్జి, ముడుమాల నారాయణరెడ్డి, సూరి పోగు ఆంథోనీ, పులి మాల్యాద్రి రెడ్డి, బొర్రాజు రమణయ్య, కొండా ప్రతాప్రెడ్డి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయ పాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన రైతులు 961 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 909 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 52 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.307, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.256.10పైసలు పలికింది.

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం కంపు కొడుతోంది. ఆర్టీసీ బస్టాండ్‌కు 565 జాతీయ రహదారికి మధ్యలో డ్రైనేజీ కాలువ ఉంది. ఆ కాలువ గట్టుపై ప్రతిరోజూ టిఫిన్ బండ్లు, పానీపూరి, ఇతర తినుబండరాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని సాయంత్రం నాలుగు గంటలు నుంచి రాత్రి పది గంటలు వరకు విక్రయాలు చేస్తుంటారు. అయితే ఆ చిరు వ్యాపారులు వ్యర్థాలన్నీ పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలో పడేస్తున్నారు. దీంతో చెత్తా చెదారాలు పేరుకుపోయి ఆ ప్రాంగణమంతా కంపు కొడుతోంది. అయినప్పటికీ అక్కడే చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో వందలాది మంది అక్కడే దొరికే టిఫిన్, పానీపూరి, ఇతర తినుబండరాలు తీసుకెళ్తుంటారు. కొందరు అక్కడే నిలబడి తింటారు. డ్రైనేజీ కంపు కొడుతున్నా గత్యంతరం లేక అక్కడే నిలబడి తినడం, కొనుగోలు చేయడం లాంటివి చేస్తుంటారు. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డ్రైనేజీ కాలువను శుభ్రం చేసి వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పెద్దదోర్నాల మండలంలోని చిన్న దోర్నాల గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఓ కామాంధుడు సామూహిక అత్యాచారానికి పాల్పడగా మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికను నాయుడు పాలెం వైసీపీ బూత్ కన్వీనర్ ఆదిమూలపు కొండయ్య శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ బాలికకు న్యాయం జరగాలని, బాధిత నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సింగా ప్రసాద్, ఎంఆర్‌పిఎస్ నాయకులు చేదూరి సుబ్బయ్య, మాజీ డీలర్ జినుకూటి రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఎంఈఓ 2 వెంకారెడ్డి

గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం గత మూడు రోజులుగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం నిర్వహించిన శిబిరంలో ఎంఈఓ-2 వెంకారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదివించటం, కథలు చెప్పించటం లాంటివి నిర్వహించారు. అనంతరం పిల్లలతో చెస్ ఆటలు ఆడించారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఈ శిబిరంలో 8 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తరువాత పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సమ్మర్ క్యాంప్ క్లాసులకు పంపించి వారి అభివృద్ధికి సహకరించాలని గ్రంథపాలకుడు కే సత్యనారాయణ కోరారు.

గ్రంథాలయంలో ఆట పాటలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థుల చేత గ్రంథపాలకుడు డివి సుబ్బారెడ్డి కథలు చెప్పించారు. ఆటల పోటీలు నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయుల చేత విద్యార్థులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.310

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శనివారం మంగమూరు గ్రామ రైతులు 1,219 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1,074 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 136 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.310 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర 252.88 రూపాయలు పలికింది. వేలంలో 22 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

బాలికను పరామర్శిస్తున్న దృశ్యం

మానవ మృగాలను శిక్షించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

సామూహిక అత్యాచారానికి గురై చికిత్స పొందుతున్న పెద్దదోర్నాల మండలం చిన్నదోర్నాల గ్రామానికి చెందిన బాలికపై సామూహిక అత్యాచారం చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి సుదర్శన్ డిమాండ్ చేశారు. బాలికకు న్యాయం జరగాలని, బాధిత నిందితులను కఠినంగా శిక్షించటం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మార్కాపురంలోని సర్వజన ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలికను ఆయనతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. సామూహిక అత్యాచారయత్నానికి పాల్పడి బాలిక అనారోగ్య కారణానికి కారణమైన మానవ మృగాలను కఠినంగా శిక్షించడం ద్వారా ఇలాంటి ఘటనలు జరగకుండా చూడవచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వం బాధిత బాలికను పరామర్శించి తల్లిదండ్రులను ఓదార్చి నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

జూన్ 29న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-గిద్దలూరు

జాతీయ లోక్ అదాలత్ జూన్ 29న జరుగుతుండటంతో గిద్దలూరు మండల న్యాయ సేవా అధికార సంస్థ తరపున న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, బ్యాంకు అధికారులకు సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్య అధ్యక్షులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ ఓంకార్ మాట్లాడుతూ జూన్ 29న జాతీయ లోక్‌అదాలత్‌లో బాధితులకు సత్వర న్యాయం చూపేలా ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని సూచించారు. కాబట్టి ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకునేలా చూడాలని, అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసుల్లో కక్షిదారులు ముందుకు వచ్చేలా అధికారులు చూడాలని అన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ మాట్లాడుతూ ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయడం ద్వారా సమాజంలో, కుటుంబంలో శాంతి నెలకొంటుందని, కాబట్టి పోలీసు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ ఓంకార్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ

రోగులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని రవీంద్ర ఉదయ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా గ్లెన్‌మార్క్స్ కంపెనీ ఆధ్వర్యంలో అక్కడి ప్రజలకు, రోగులకు రక్తపోటుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మన్నె రవీంద్ర మాట్లాడుతూ ఉరుకులు, పరుగుల జీవన శైలి కారణంగా చాలా మంది ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. రక్తపోటు, మధుమేహం, ఇతర వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పనిలో శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువగా ఆలోచించడం, కూర్చున్న చోటనే పనిచేయడం తో ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బరువు పెరిగి అనేక వ్యాధులకు గురవుతున్నారని చెప్పారు. 30 సంవత్సరాలు దాటిన వాళ్లు ఎక్కువగా బీపీ బారిన పడుతున్నారని తెలిపారు. సరైన వ్యాయామం చేయడంతో పాటు మంచి ఆహారపు అలవాట్లు నెరవేర్చుకుంటే ఈ ముప్పు నుంచి బయట పడవచ్చునని తెలిపారు. ప్రధానంగా ఆహారంలో ఉప్పు వాడకం తగ్గించాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ పిఎల్ నారాయణరెడ్డి, గ్లేవ్ మార్క్ డివిజనల్ మేనేజర్ పి అస్లాం ఖాన్, ఫీల్డ్ సేల్స్ ఆఫీసర్ ఐ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వికలాంగునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలం నరసాయిపాలెం గ్రామానికి చెందిన మండ్ల యోగిరాములు అనే వికలాంగుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి కుటుంబ పోషణ భారమై దాతల సాయం కోరిన విషయం తెలిసిందే. స్పందించిన మురారిపల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు తెల్లమేకల నారాయణ రూ.1,500 విలువైన 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు యోగిరాములు ఇంటికి వెళ్లి అందజేశారు. అలాగే శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అటెండర్ కొక్కిలిగడ్డ ప్రార్థనరావు రూ.1000, కొలుకుల సచివాలయంలో ఏఎన్ఎంలగా విధులు నిర్వహిస్తున్న వికలాంగ ఉద్యోగిని రూ.300 ఫోన్‌పే ద్వారా అందజేశారు. యోగా రాములు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, మండల అధ్యక్షులు కొత్తపల్లి కిషోర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ

ప్రజాశక్తి-కంభం రూరల్

కౌంటింగ్ సమయంలో ఘర్షణలు చేస్తే ఉపేక్షించమని కంభం సీఐ రామకోటయ్య అన్నారు. శనివారం కంభం పోలీస్ స్టేషన్‌లో పలు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగే అవకాశం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పులి రాజేష్, మండలంలోని ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొమరోలు: కొమరోలు మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి కొమరోలు ఎస్ఐ మధుసూదన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా 2024 అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన గ్రామస్తులకు, వివిధ పార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఎవరు కూడా గొడవలు పడకుండా సంయమనం పాటిస్తూ కలిసి మెలిసి ఉండాలని విజ్ఞప్తి చేశారు. అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీ నాయకులు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా తమ తమ కార్యకర్తలను నియంత్రణలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్ రావు, పోలీస్ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెంచుగూడేల్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండ పాలెం మండలంలోని బిళ్లగొంది, పోతురాజుపెంట, గౌతమ బుద్ధుని కాలనీ, పుల్లయ్య కుంట చెంచు గూడేలలో శనివారం వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వి కోటానాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా గూడేల్లోని చెంచులకు పరీక్షలు నిర్వహించి సాధారణ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితులకు రక్తపూతలు తీసి అవసరమైన మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధ పడుతున్న రోగులకు ప్రోటీన్ పౌడర్లు, ఐరన్ టానిక్‌లు పంపిణీ చేశారు. చిన్నారులకు టీకాలు వేశారు. విటమిన్ ఏ ద్రావణాన్ని తాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి కోటానాయక్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించారు. ఆరోగ్య విద్యను బోధించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రమణమ్మ, నాగలక్ష్మి, శ్రావణి, లక్ష్మీదేవి, అంకమ్మ, నలగాటి వెంకట్రామయ్య, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పరిసర గ్రామాల

పశువుల యజమానులకు అవగాహన

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు రైల్వే స్టేషన్ పరిధి గిద్దలూరు-సోమదేవిపల్లి రైల్వే ట్రాక్ పరిసర గ్రామాల పశువుల యజమానులు రైల్వే ట్రాక్‌పై పశువులను వదలడం వలన గత వారం రోజులలో దాదాపు 20 గేదెలు ప్రాణాలు కోల్పోయిన సంఘటన గురించి వివరిస్తూ రైల్వే అధికారులు పశు యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైల్వే ట్రాక్‌పై పశువులు సంచరించడం, మేత మేయటం లాంటి చర్యల వలన పశువులు ప్రాణాలు కోల్పోవడటం, తద్వారా పశుపోషకులు తమ పశుసంపద కోల్పోతున్నారు.

కొన్ని సందర్భాల్లో వేగంగా వెళుతున్న రైలు ఢీకొట్టడంతో రైలు ప్రమాదం జరిగే సందర్భం ఉందన్నారు. రైలు ప్రమాదాలలో చనిపోయిన పశువుల యజమానులపై రైల్వే చట్టం ప్రకారం జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే రక్షణ నంద్యాల ఇన్‌స్పెక్టర్ ఇ నాగభూషణ్, గిద్దలూరు ఎస్ఐ కె పిచ్చిరెడ్డి, కానిస్టేబుల్ శేషయ్య, ప్రజలు పాల్గొన్నారు.

జీవామృతంతో అధిక దిగుబడులు

- భూమిని సారవంతం చేయనున్న సహజ ఎరువులు
- ఆరోగ్యవంతమైన దిగుబడులపై రైతుల ఆసక్తి
- వ్యవసాయ ఖర్చులు తగ్గించనున్న జీవామృతం

ప్రజాశక్తి - అద్దంకి

డిజిటల్ జీవన విధానంలో చిన్నారుల నుండి వయసు నిండిన పెద్దల వరకు ఏదో ఒక అనారోగ్య సమస్య ఉత్పన్నమవుతుంది. జీవన విధానంలో వచ్చిన అనేక మార్పులతోపాటు తినే ఆహారంలో అధిక దిగుబడి కోసం రసాయన ఎరువులు వాడటం వలన జీవన ప్రమాణంలో మార్పు వస్తుందని ఇప్పటికే పలు సంస్థలు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతాంగం మాత్రం దిగుబడి కోసం రసాయన ఎరువులు విరివిగా వాడుతున్నారు. వ్యవసాయంలో అనేక మార్పులు వస్తున్నాయి.

ఎరువులు వాడకం తీసుకోవలసిన జాగ్రత్తలు

రైతులు అధిక దిగుబడి కోసం చీడ, పీడల నివారణకు ఉపయోగిస్తున్న రసాయన ఎరువుల కారణంగా భూసారం తగ్గిపోతుందని, నేల, వాయు కాలుష్యం సంభవిస్తుందని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలామంది రైతులు జీవన ఎరువులు వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. జీవ ఎరువులు సహజమైనవి కాబట్టి వాటి వలన కాలుష్యం ఉండదు. పంటకు ఎలాంటి హాని జరగదని ప్రకృతి వ్యవసాయ పరిశోధకులు చెబుతున్నారు. ఇవి వాతావరణంలో నత్రజీని స్థిరీకరిస్తాయని తెలిపారు. జీవన ఎరువులతో భాస్వరం, సూక్ష్మ పోషకాలు, హార్మోన్లు, ఎంజైములు లభ్యమై పంట ఎదుగుదల, దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. దిగుబడులు 10 నుండి 20 శాతం పెరుగుదల ఉంటాయన అంటున్నారు. సాధారణంగా జీవన ఎరువుల్లో నత్రజనిని స్థిరీకరించేవి, భాస్వరం కరిగించి మొక్కకు అందించేవి, మొక్క పెరుగుదలను అభివృద్ధి పరిచే సూక్ష్మజీవులు, పొటాషియం, జింక్ కరిగించేవి, సేంద్రియ కర్బనాన్ని తయారు చేసి సూక్ష్మజీవులు చాలా రకాలు ఉన్నాయి. అయితే జీవన ఎరువుల వాడకంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అవి మరింత ప్రభావంతంగా పని చేస్తాయని నిపుణులు తెలిపారు. ఈపాటికే నియోజకవర్గంలో అనేక మంది రైతులు జీవన ఎరువులు వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని చిన్న కొత్తపల్లి, గోవాడ,

జీవన ఎరువులను తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫోటో)

శ్రీనివాస నగర్, సాధునగర్, వెంపరాల రైతులు పండ్ల తోటలకు, పూల మొక్కలకు, కూరగాయ తోటలకు ఘన జీవామృతాలు, రసాయనాలను ఉపయోగిస్తున్నారు.

అజో స్పైరిలిం అనే బ్యాక్టీరియా

మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశం ఉన్నచోట వేర్లలోకి చొరబడి జీవిస్తాయి. దీనివలన ఈ జీవన ఎరువు స్థిరీకరించిన నత్రజనిని నేరుగా మొక్కకు ఎక్కువ శాతం అందుబాటులో ఉంటుంది. ఈ జీవన ఎరువు వరి, చెరకు, పత్తి, మిర్చి, జొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు, అరటి తదితర పంటలకు బాగా ఉపయోగపడుతుంది. సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న నెలలోనూ ఇది పనిచేస్తుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

జీవన ఎరువు ప్యాకెట్‌ను ఎండ వేడి తగలని నీడ ప్రదేశాల్లోనే నిల్వ చేయాలి. రైతు వాడే జీవన ఎరువు ప్యాకెట్‌ను ఆ పంటకు సరైనదై ఉండాలి. ప్యాకెట్‌పై పేర్కొన్న గడువు తేదీలోపే ఆ జీవన ఎరువులు వాడాలి. రసాయనాలతో విత్తన శుద్ధి చేసుకునేటప్పుడు విధిగా 24నుంచి 48గంటల వ్యవధి ఉండాలి. రసాయన ఎరువులతో కలిపి జీవన ఎరువులు వాడకూడదు. జీవన ఎరువులు సమర్ధవంతంగా పనిచేయడానికి నాణ్యత గల కల్చర్ వాడుకోవాలి. పైరుకు నిర్దేశించబడిన జీవన ఎరువును పొలంలో తగినంత తేమ ఉన్నప్పుడే వాడుకోవాలి. సేంద్రియ ఎరువుతో జీవన ఎరువు కలిపిన వెంటనే పంటకు వాడాలి. జీవన ఎరువులను మొదటిసారిగా వినియోగించేటప్పుడు సంబంధిత శాస్త్రవేత్తలు లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సలహా మేరకు వాడుకోవడం ఉత్తమమైన పద్ధతి.

జీవామృత ఎరువులు వాడకంతో కలిగే ప్రయోజనాలు

వాతావరణ కాలుష్యం తగ్గడం, హార్మోన్లు విటమిన్ లభ్యమయ్యే పెరుగుదల వేగంగా ఆరోగ్యకరంగా ఉంటుంది. నేల నుంచి సంక్రమించి తెగుళ్లను కొంతమేర అరికట్టవచ్చు. నేల భౌతిక లక్షణాలు బాగుండి భూసారం పెరుగుతుంది. రైతులుకు రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గుతుంది. పంట సాధారణ దిగుబడులు పది నుంచి 20శాతం వరకు పెరుగుతుంది. రసాయన ఎరువులు వాడకం 20 నుంచి 25 శాతం మేర తగ్గించుకోవచ్చు. దీనితో రైతుకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉన్నది.

వరి పొలంలో వాడే విధానం

ఒక ఎకరం పొలంలో వరి నాట్లు వేసిన మూడు నుంచి ఏడు రోజులకు నాలుగు నుంచి ఆరు కిలోల జీవామృత ఎరువును 40 నుంచి 50కిలోలు సేంద్రియ ఎరువుతో కలిపి చల్లుకోవాలి. ఇది వేసిన 15నుంచి 20రోజుల్లో ఈ నాచు మందముగా చాపల అల్లుకుపోతుందని, ఆ తరువాత పొలంలో నీరు తీసివేసి నేలను తాకిన నాచును మట్టిలో కలిసేటట్లు చేయాలి. ఈ జీవన ఎరువులో స్థిరీకరించిన నత్రజనిని మొక్కకు అందటమే గాక సేంద్రియ పదార్థంగా కూడా మొక్కుకు ఉపయోగపడుతుంది. పప్పు జాతి పైరులైన కంది, పెసర, మినుము, సెనగ వంటి పైర్లకు, వేరుశనగ, సోయా చిక్కుడు వంటి నూనె గింజల పైర్లకు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించి ఉపయోగించాలి. దీని వల్ల మొక్క వేర్లపై లేత గులాబీ రంగులు ఏర్పడతాయని, ఈ బోడి పిల్లలో ఉండే రైజోబియం గాల్లోని నత్రజని స్థిరీకరించి మొక్కలు అందిస్తుంది. రైతు ఏ పంట వేయాలనుకుంటున్నారో ఆ పంటకు నిర్దేశింపబడిన రైజోబియం మాత్రమే వాడాలి. పూర్వపు రోజుల్లో మనం చేసే వ్యవసాయం దిబ్బ ఎరువుతో పంటలను పండించేవారు.

అన్ని వ్యాధులకూ ఆయుర్వేద వైద్యం

ప్రజాశక్తి - పంగులూరు

డాక్టర్ కృష్ణ కుమార్

ఆయుర్వేద వైద్యం ద్వారా అన్ని రకాల వ్యాధులకు మంచి వైద్యం చేయటంతో పాటు మంచి మందులు కూడా ఉచితంగా ఇస్తామని స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ పుసులూరి కృష్ణ కుమార్ చెప్పారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ప్రజాశక్తి శనివారం సందర్శించింది. ఆయుర్వేద వైద్యం పురాతన వైద్యమని అన్నారు. భారత ప్రజలు వేలాది ఏళ్లుగా ఆయుర్వేద వైద్యాన్ని ఆదరించారని చెప్పారు. బ్రిటిష్ వారు భారత దేశానికి రావడంతో అల్లోపతి వైద్యానికి ప్రజలు అలవాటు పడ్డారని అన్నారు. అయితే ఇప్పుడు ప్రజలు ఆయుర్వేద వైద్యం పట్ల మక్కువ చూపిస్తున్నారని అన్నారు. ఆయుర్వేద వైద్యంలో సర్వరోగలకు వైద్యం ఉందని తెలిపారు. 25ఏళ్లుగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల పంగులూరులో ఉందని అన్నారు. గతంలో ఇక్కడ మందులు చాలా తక్కువగా ఉండేవని, ఇప్పుడు మందులు కొరత లేదని తెలిపారు. అన్ని రకాల జబ్బులకు మందులు వచ్చాయని అన్నారు. ఈ మందులు చాలా విలువైనవని అన్నారు. నడుముల నొప్పి, మోకాళ్ళ నొప్పి, తలనొప్పి, గ్యాస్ ట్రబుల్, కాళ్ల నొప్పులు, తల తిరగటం, కడుపులో నొప్పి, చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులకు, ఇంకా అనేక రకాల రోగాలకు మంచి మందులు ఉన్నాయని చెప్పారు. పకృతిలో లభించే మూలికలు ఉపయోగించి ఔషధాలు తయారు చేస్తారని తెలిపారు. ఈ మందులు వేడి చేస్తాయని, పత్యాలు ఎక్కువనే అపోహలు వీడి ఈ మందులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఇక్కడ ఉచితంగా వైద్యం చేయడంతో పాటు మందులు కూడా ఉచితంగానే ఇస్తామన్నారు. మండలంలో ఇప్పుడిప్పుడే ప్రజలు ఆయుర్వేద వైద్యానికి అలవాటు పడుతున్నారని తెలిపారు. హాస్పటల్లో ఓపి రోజు రోజుకి పెరుగుతుందని చెప్పారు. ప్రజలు ఆయుర్వేద వైద్యం ఉపయోగించుకొని వారికున్న రోగాల నుండి ఉపశమనం పొందాలని, ఆయుర్వేద వైద్యాన్ని ఆదరించాలని కోరారు.

అద్దంకి ఫలితాల్లో పంగులూరే కీలకమా ?

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా చర్చ
- ఏ మండలంలో ఎవరికి ఎన్ని ఓట్లు పడి ఉంటాయనే విశ్లేషణ

ప్రజాశక్తి - పంగులూరు

ఎన్నికలు ఈనెల 13న జరిగాయి. ఓటర్ల తీర్పు ఇవిఎంలలో నిక్షిప్తమైంది. అయితే ఎన్నికల అనంతరం పోలింగ్ సరళిపై సర్వత్ర చర్చ జరుగుతొంది. అద్దంకి నియోజకవర్గంలో మండలాల వారీగా అభ్యర్ధులు విశ్లేషిస్తున్నారు. ఏ మండలంలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తాయి. ఎంత మెజార్టీ వస్తుంది. ఏ అభ్యర్థి ఏ మండలంలో ఎంత నష్టపోతున్నాడు. చివరికి ఏ అభ్యర్థిని ఏ మండలం గెలిపించబోతుందనే దానిపై చర్చిస్తున్నారు. టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్, వైసీపీ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి మద్యే ప్రధాన పోటీ జరిగినట్లు చర్చిస్తున్నారు. అయితే ఈ అభ్యర్థులకు ఏ మండలంలో ఎంత అనుకూలత, ఏ మండలంలో వారికి బలాలు, బలహీనతలు ఉన్నాయనే దానిపై విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, పంగులూరు, కొరిసపాడు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో టిడిపి ఏ మండలంలో బలంగా ఉంది. వైసీపీ ఏ మండలంలో బలంగా ఉంది. ఏ మండలంలో ఎంత మెజారిటీ రాబోతుంది? ఆ మెజార్టీ ఏ అభ్యర్థికి ఎలా ఉపయోగపడబోతోందనే విషయం చర్చిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గొట్టిపాటి రవికుమార్‌కు 13,500 ఓట్ల మెజారిటీ లభించింది. ఈ లెక్కలతో పోల్చుకుంటూ టిడిపి అభ్యర్థి రవికుమార్‌ను పంగులూరు మండలంలో వచ్చే మెజార్టీ ద్వారా విజయం సాధిస్తాడని అంచనా వేస్తున్నారు. ఆయన విజయానికి పంగులూరు మండలం దోహదపడుతుందని టిడిపి నాయకులు వాదిస్తుండగా పంగులూరు మండలంలో వైసీపీకి వచ్చే మెజారిటీ వైసీపీ అభ్యర్థి హనీమిరెడ్డి విజయానికి కారణం అవుతుందని వైసీపీ చర్చిస్తున్నారు. టిడిపి నాయకులు చెబుతున్న లెక్కల ప్రకారం అద్దంకి మండలంలో మూడు వేల వరకు రవికుమార్‌కు మెజారిటీ వస్తుందని, బల్లికురవ మండలంలో వైసీపీ అభ్యర్థికి కొంత మెజార్టీ వచ్చిన దానిని కొరిసపాడు మండలంలో వచ్చే మెజారిటీకి సరిపోతుందని విశ్లేషిస్తున్నారు. సంతమాగులూరు మండలంలో 3,500 మెజార్టీ, పంగులూరు మండలంలో గతంలో వచ్చిన 3,900 కన్నా ఎంతో కొంత అదనంగానే మెజార్టీ వస్తుందని, ఏది ఏమైనా గొట్టిపాటి రవికుమార్ 10వేలకు పైగా విజయం సాధించటం ఖాయమని టిడిపి నాయకులు అంచనా వేస్తున్నారు.

వైసిపి నాయకుల విశ్లేషణ ఇలా ఉంది

సంతమాగులూరు మండలంలో వచ్చే టిడిపి మెజారిటీకి కొరిసపాడు మండలంలో వైసీపీకి వచ్చే మెజారిటీ సరిపోతుందని, అద్దంకి మండలంలో తమ అభ్యర్థికి కనీసం రెండున్నర వెయ్యి మెజార్టీ వస్తుందని, దీనికి తోడు బల్లికురవలో 2,000 మెజారిటీ వస్తుందని, పంగులూరు మండలంలో ఈసారి కనీసం 2,000 మెజారిటీ వస్తుందని అంచనా వేస్తున్నారు. అందువలన తమ అభ్యర్థి హనిమిరెడ్డి ఏడున్నర వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడని వైసిపి నాయకులు అంచనా వేస్తున్నారు. ఈ రెండు పార్టీల అంచనాల్లో పంగులూరు మండలం ఓటర్ల తీర్పు అభ్యర్ధుల గెలుపు, ఓటముల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఈ మండలంలో ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందో ఇదమిద్దంగా తెలియని పరిస్థితి. 2019 ఎన్నికల్లో 3,900 ఓట్లు టిడిపి మెజార్టీ సాధించగా, ఈసారి ఆ పరిస్థితి కనిపించడం లేదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు వైసీపీకి బాగా ఓట్లు వేశారని, ఈసారి టిడిపికి మెజార్టీ రాదని వైసిపి అంచనా వేస్తుంది. పంగులూరు మండలంలో గతంలో వచ్చిన 39ఓట్లు కన్నా ఇంకా భారీగా మెజార్టీ వచ్చే అవకాశం ఉందని కొంతమంది పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మండలంలో పరిస్థితిని ఏ ఒక్కరూ సరిగా అంచనా వేయలేకపోతున్నారు. నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో ఇద్దరు అభ్యర్ధులు సమానంగా ఓట్లను పంచుకుంటే పంగులూరు మండలంలో వచ్చే ఓట్లే కీలకం కానున్నయని అంచనావేస్తున్నారు. ఓటర్లు ఇచ్చిన తీర్పు జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో తేలనుంది.

నేడు సుందరయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో నేడు కమ్యునిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ బాబురావు తెలిపారు. సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు హాజరు కావాలని కోరారు.

పర్చూరు : స్థానిక బొమ్మల సెంటర్లో నేడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు సిపిఎం నాయకులు కె శ్రీనివాసరావు తెలిపారు. సభకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని కోరారు.

రథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు

వాసవీ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి దేవస్థాన రథోత్సవంలో టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం పాల్గొన్నారు. రెండు రోజులుగా ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా, టిడిపి నాయకులు బట్టు మల్లికార్జునరావు, వైకరుణ శ్రీనివాసరావు, కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, కుక్కల వెంకటేశ్వరరావు, కంభం సుధీర్, గొట్టుముక్కల లేనిన్ పాల్గొన్నారు.

చీరాల : స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా సంత బజారులోని దేవస్థానంలో శనివారం విశేష అభిషేకం, మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు సువర్ణ కిరీటం ధరించి దర్శనమిచ్చినట్లు ఆలయ అధ్యక్షులు గుంటూరు మాధవరావు, కార్యదర్శి వలివేటి వరదరాజులు తెలిపారు. అనంతరం 2వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి దుగ్గిలం విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు బెల్లంకొండ శేషారత్నం, తుమ్మన పవన్ కుమార్, రమేష్ బాబు, నాగలక్ష్మి, ప్రసన్న, సుకన్య, రాజ్యలక్ష్మి, విజయ, వరికూటి రమేష్, ప్రభాకర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరు : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయం నుంచి 102 కలశాలతో గ్రామోత్సవం శనివారం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరామ్ వెంకట సుబ్బారావు, మామిడిపాక హరి ప్రసాద్, వై సుబ్బారావు, టి భావనారాయణ పాల్గొన్నారు.

ఎపిఇఎపి సెట్‌కు 200 మంది హాజరు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కలేజీలో జరుగుతున్న ఎపి ఇఎపి సెట్ పరీక్షలుకు 200మంది హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు శనివారం తెలిపారు. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పరీక్షలు కళాశాల్లోని టిసిఎస్ ఐయాన్ సెంటర్ నందు 16నుండి 23వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. 213మందికి 200మంది హాజరైనట్లు తెలిపారు.

ముగిసిన సియు సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో కామన్ యనివర్సిటి ఎంట్రన్స్ టెస్ట్ శనివారం ముగిసినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఎన్‌టిఎ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో యూనివర్సిటిల్లోని వివిధ కోర్సుల ప్రవేశాలకు పరీక్ష 15నుండి 18వరకు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు.

దళిత కూలీలకు న్యాయం చేయండి

సిఇఒను కోరిన బిళ్లా చెన్నయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దళితకూలీలతో పొగాకు పనిచేయించుకొని డబ్బులు ఎగ్గొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిళ్ళా చెన్నయ్య రాష్ట్ర ప్రదాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరారు. ఈ మేరకు శనివారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో బిళ్ళా చెన్నయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కొండపి మండలం. ముప్పవరం గ్రామానికి చెందిన పెత్తదార్లు బాపట్ల జిల్లా సంతమంగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెంది 25మందిని పొగాకు పనికి తీసుకువచ్చారన్నారు. వారు పని చేయ్యడానికి ఒక్క మనిషికి 87.500.చొప్పున మాట్లాడి పని అయిపోయాక డబ్బులు ఇవ్వకుండా వారిపై అత్యాచార యత్నం. కుల దూషణ చేసి వారిని కొట్టి నెట్టివేశారన్నారు. ఈ విషయమై కొండపి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఎస్సై కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఈ విషయాన్ని ఎస్పి, కనిగిరి డిఎస్పి, కొండపి సిఐతో చెప్పామని, ఎన్నికల నెపంతో ఉద్దేశ పూర్వకంగా దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. కలెక్టర్, ఎస్పి చెప్పిన ఏమి జరగలేని పరిస్థితి ఉందన్నారు. రాష్టంలో జరుతున్న అల్లకల్లోలాలను ఎన్నికల కమిషన్ సీరియస్ గా తీసుకుందని, లేటుగా ఎందుకు కేసు కట్టారని ప్రశ్నించారు. ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ విచారణ చేయాలని ఆయన కోరారు. తాము పిర్యాదు చేస్తే సిఇఒ వెంటనే ఆ పిర్యాదు ను డిజిపికి పంపారన్నారు. అప్పుడు కొండపి ఎస్సై కేసు నమోదు చేసారన్నారు. రాష్ట్ర మాలమహానాడు వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుండి జరగనున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు, జూన్ 1వ తేదీ నుండి జరగనున్న ఎపి ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు సజావుగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కలెక్టర్ దినేష్ కుమార్, అధికారులతో సమావేశమై జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షల ఏర్పాట్లు, ఎపి ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 24వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2-30 గంటల నుండి సాయంత్రం 5-30 వరకు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 15,291 మంది 7,075 మంది రెండవ సంవత్సర విద్యార్థులు హాజరు కానున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎంపిక చేసిన 43 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షలు సజావుగా ఎలాంటి నిర్వహించేలా కంట్రోల్ రూమ్ ను కూడా ఏర్పాటు చేసి 08592- 281275 టెలిఫోన్ నెంబర్ ను కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. ఈ నెల 24 నుండి జూన్ 3వ తేదీ వరకు 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఎపి ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 1వ నుండి 8వ తేదీ వరకు ఎపి ఓపెన్ స్కూల్స్ ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. సమావేశంలో అదనపు ఎస్పి ఎస్.శ్రీధర్ రావు, జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, ఆర్ఐఒ ఏ. సైమన్ విక్టర్, , జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి: డిఆర్ఒ

బాపట్ల జిల్లా: ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఎటువంటి లోపాలకు తావు లేకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డిఆర్ఓ చాంబర్లో ఈనెల 24 నుండి జరుగబోయే ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరావు మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 3 వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,384 మంది విద్యార్థులు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు,మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు జరుగుతాయని, మొత్తం 9,579 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లుగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి యర్రయ్య వివరించారు. డిఆర్ఓ సత్తిబాబు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్ర వాతావరణం , మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు.

ఒంగోలుకు ఇతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్స్

స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించిన అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇతర జిల్లాలో ఎన్నికల విధులలో పాల్గొన్న ఉద్యోగులు ఓట్లు వేసిన పోస్టల్ బ్యాలెట్స్ ఒంగోలు చేరాయి. స్థానిక స్పందన సమావేశ మందిరంలో శనివారం ఒంగోలు పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝూన్సీ లక్ష్మి జిల్లా పోస్టల్ ఎలక్షన్ ఆఫీసర్ వి. విశ్వేశ్వరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల లలో నిలబడిన ఇండిపెండెంట్ అభ్యర్థుల సమక్షంలో వాటి సీల్స్ తెరచి జిల్లా లోని 8 నియోజకవర్గల వారీగా విభజించి అసెంబ్లీ స్ట్రాంగ్ రూములకు పంపించారు. ఒంగోలు పార్లమెంట్‌కు సంబందించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ను కలెక్టరెట్ కార్యాలయంలోని పార్లమెంట్ స్ట్రాంగ్ రూంకు పంపించారు. ఇతర జిల్లాల నుండి వచ్చిన పోస్టల్ బ్యాలెట్స్‌ను శనివారం ఒంగోలు సబ్ ట్రెజరీ కార్యాలయం నుండి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పోలీస్ ఎస్కార్ట్ తో స్పందన హాలు కు తీసుకొచ్చారు. ఇతర జిల్లాల నుండి జిల్లా వచ్చిన పోస్టల్ బ్యాలెట్స్‌లో పార్లమెంట్ ఓట్లు 2330 ఓట్లు, అసెంబ్లీలకు 2343 ఓట్లను బాక్సులలో పెట్టి సీలు వేసి పోలీస్ ఎస్కార్ట్ తో స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో జివి సుబ్బారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి బసినేపల్లి రాజశేఖర్, టిడిపి ప్రతినిధి స్వరూప్, అభ్యర్థులు రాయపాటి జగదీష్, కొండారెడ్డి, యోహాన్, కోటేశ్వరరావు, డి.బాలాంజనేయులు, టి.హరి ప్రసాద్, బి.ఏడుకొండలు, ఎస్. శ్రీకాంత్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, పార్టీల ప్రతినిధులు

ఇఎపిసెట్ ఫలితాలలో 'శ్రీ ప్రతిభ' సత్తా

విద్యార్థులను అభినందించిన చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

తెలంగాణ ఇఎపి సెట్ పరీక్షల ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యార్థులు రాణించారు. యం.పి.సి విభాగములో పల్లమూడి నందిని చౌదరి 3203 ర్యాంకు, రావి మహేష్ చౌదరి 3670, నందికంటి వెంకట తమిణ్ కష్ణ - 3934, పట్టనునేని మాహిత సాయి 4978, తోట వెంకట అవినాష్ నాయుడు 3059, పుల్లూరి గోపవర్ధన్ 5893 ర్యాంకు సాధించారు. వై.పి.సి విభాగంలో చెనికల హరిబాబు 3084 ర్యాంకు సాధించారు. విద్యార్థులను శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సి.ఇ.ఒ. నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

గెలుపుపైనే ఆశలు.!

పోలింగ్ ప్రక్రియ ముగిసింది. వచ్చే నెల 4న జరుగనున్న ఓట్ల లెక్కింపుతో పోటీ చేసిన అభ్యర్థుల గెలుపోటములు ఖరారు కానున్నాయి. పోలింగ్, కౌంటింగ్ మధ్య మూడు వారాల సమయం వరకు ఉన్న క్రమంలో అభ్యర్థులు ఎవరికి వారే గ్రామాలు, బూత్‌ల వారీగా పోల్ అయిన ఓట్లను బట్టి తమకు ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో లెక్కలు కడుతున్నారు. ఇంత మెజారిటీతో గెలువబోతున్నామంటూ తన అనుచరులను ఉత్సాహపరుస్తున్నారు.

పోలింగ్ సందర్భంగా రెండు జిల్లాల్లోనూ పలు చోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల కోసం జిల్లాలకు కేటాయించిన పోలీస్ ఫోర్సు తక్కువగా ఉందని తెలిసింది. ఎన్నికల్లో బాగా ఘర్షణలు జరగడానికి అవకాశం ఉన్న జిల్లాలకు ఎక్కువ పోలీస్ ఫోర్స్‌లను పంపారు. గతంలోలా అభ్యర్థుల వెంట షాడో పార్టీల ఏర్పాటు సక్రమంగా లేదు. దీంతో పలు ప్రాంతాల్లో గొడవలు జరిగాయి. అభ్యర్థులు కూడా కొన్ని చోట్ల ఘర్షణలకు కారణమయ్యారు. చీరాల, బాపట్ల, ఒంగోలు,దర్శి తదితర నియోజకవర్గాల పరిధిలో పోలీస్ పికెట్‌లు పెట్టారు. చీరాలలో కౌంటింగ్ లోపు తరువాత కూడా ఘర్షణలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తగిన ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది. బాపట్ల జిల్లాలో పోలింగ్ రోజున, తదనంతరం జరిగిన ఘర్షణలపై మొత్తం 284 మంది పై 36 కేసులు నమోదు చేశారు. 255 మందిని అరెస్ట్ చేసి 41(ఎ)సీఆర్పీసీ కింద నోటీసు జారీ చేశారు. శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమైన వివిధ ఘటనలపై 24 మందిపై 13 కేసులు నమోదు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఘటనలపై మరో 21 కేసులు నమోదు చేసి 42 మందిని అరెస్ట్ చేశారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ పికెట్‌లను నిర్వహిస్తున్నారు. ఘర్షణలకు పాల్పడిన వారికి పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఘర్షణలకు పాల్పడటానికి అవకాశం ఉన్న వారిపై, చెడు నడత కలిగిన వ్యక్తులపై, రౌడీ షీటర్స్‌పై నిఘా ఉంచారు.

ఈ వేసవికి ముందు సక్రమంగా వర్షాలు పడక, కాలువల నుంచి నీరు రాక గ్రామాల్లో ప్రజలకు తాగునీరందించే చెరువులు ఎండిపోయాయి. తీవ్రమైన మంచినీటి సమస్య తలెత్తింది. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా జిల్లాలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు మూడేళ్లుగా నత్తనడకన సాగుతూ వచ్చాయి. బాపట్ల జిల్లాలో ప్రతి ఇంటికీ 2024 నాటికి మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వాలనే ధ్యేయంతో జిల్లాలో 1,403 పనులు చేపట్టేందుకు రూ.470 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగింది. కానీ సదరు పనుల్లో పురోగతి లేకుండా పోయింది. అధికారులు పనులు ప్రారంభించేందుకు టెండర్లు పిలిచినప్పటికీ బిల్లుల మంజూరులో నెలకొన్న విపరీత జాప్యం వల్ల కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. రెండు జిల్లాల్లోనూ సముద్రతీర ప్రాంతంలోని ప్రజలు తాగునీటి సమస్యను చాలా కాలంగా ఎదుర్కొంటున్నారు. రొయ్యల చెరువుల వల్ల సముద్రంలో ఆటుపోట్ల కారణంగా తీరంలోని భూగర్భజలాలు ఉప్పునీరుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పథకాల ద్వారా గ్రామీణప్రాంత ప్రజలకు మంచినీటి కుళాయిల ద్వారా తాగునీరు అందించాల్సి ఉంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా